# ఆడదాయికి నోరుండాల

ఎహా బొట్టే ఉంది. వరొహాత్తినీ వరొహాత్తినీ అడగక్కర్లేదు. దాన్నే తోలేస్తాం. దూరాభారం అంటున్నారు. అదీ మంచిదీను. అనే అనుకున్నాం!

వుుండా దేవుడు! దాని నవ్వు సూడ్నేకపోనాడు. దాని మురిసిపాటూ మా మురిసిపాటూ మూణ్ణాళ్ళ బాగోతమే అయిపోనాది.

దాని బాధ మా గొప్ప బాధ! అందర్నాటి బాధా కాదు. వొయెసు వొసుకు బతుకుతున్నాది. వొయెసు మోసుకుబతకడం ఎంతనావు కస్టమో ఏరే సెప్పాలా? సిన్నది! నిండా మూడు పదులు కూడా నేవు! గోరం జరిగిపోనాది! అది మన్నీ మనసుల్లో ఆడి నవ్వుతూ తిరగాడాలీ అంటే ఆయమ్మ గారితో తోలీడమే నయవనుకున్నోం.

మా బొట్టి అంటే నా కూతురు అనుకునేరు! కాదు. సెల్లెలు! అనా అని నా ఎన్నుని బుట్టిందాయనుకునేరు! అదీ కాదు. మా నడిం పిన్నమ్మ కూతురు!

సొంత సెల్లెలి మీదైనా నాకంతసేటు మమకారం నేదు. అలాంటిది దీన్ని సూడకుండా సిటం ఉండనేక పోయేదాన్ని! మనువై నేనీ ఊరొచ్చిన కొత్తన్నో సూడాల! వోరం తిరక్కుండా మా ఊరెల్లాలని పేసీ ఎట్టీసీదాన్ని! కన్నోరు మీద దీవేసి కాదు! దీన్ని సూడ్దానికే ఎగ్రెత్తిపోయేదాన్ని!


మాసక్కటి దాయి! మానడిం పిన్నమ్మ తెల్లటిది. నడింపిన్నాయనా తెల్లటోడే! మరి గుంట పిల్లలూ సక్కటోల్లే కలిగినారు. ఇది మరీ సక్కదనాల సుక్క. దాంతెలుపూ ఆ సక్కదనవూ సూసి ఏ బాపనదాయనో, రాసకూతురనో అనుకునే వోరు కాని మా ఇంట పుట్టిన బొట్టెని అనుకునే వోరు కాదు! సెపితే నమ్మరు! దాని తలకట్టూ కొప్పూ సూసి తీరాల్సిందే! సివరంటా జటల్లుకుని రిబ్బీను ముడి ఏసుకుంటే జట కాలి పిక్కల్దాకా ఏనాడేది! జటని మజ్జికి మడిచే ఎప్పుడూ రిబ్బీను కట్టుకునేది!

కడుపున కనుక్కన్న బొట్టిలంటే ఏయమ్మకైనా ముద్దే ఉంటాది! అందునో ఇంతే టీ నేదు, నోకపు ముద్దు! అదీ ముద్దంటే! సూసేరూ ఆ ముద్దు అందరి బొట్టిలకీ రాదు. ఇది సంటిదాయిగా ఉన్నేటప్పుడు ఈది ఈదందరూ 'నాగుమణీ నాగుమణీ' అంటూ వొల్లమాలిన ముద్దు సేసీవోరు. నాగుల్సవితి నోడుట్టిందని నడింపిన్నమ్మా పిన్నాయనా దీనికి నాగుమణని పేరెట్టుకున్నోరు. నాగదేవుడు నాల్గుకాలాల పాటు సల్లగా సూడ్నేదు సరికదా దాని బతుకునే కాటేసినోడు!

దాని బతుకినా తెల్లారిపోతాదని ఎవులమూ అనుకోనేదు. మారాణీలా ఉంటాది. దానికేటనుకునే వోళ్లం నిజివే సత్తికాలప్పిల్లే. అమాయకపు గుంటపాపే. అగుతేనేవి అది సక్కదనాల సుక్క! దానికేటనుకునేనోళ్లం! సెప్పొద్దూ దాని బతుకు మా బెమ్మాండంగానే మొదలయినాది. దాన్ని మనువాడ్డానికి మొగాళ్లు పోటీలే ఒడ్డారు!

ఆయాళ ఆదోరం. మావు అప్ప సెల్లీలం సినీమా సూడ్డానికి శీకిప్పా హోలుకెల్నినోం, మా అప్పసెల్లిలొందరికీ సినీమా ఎర్రే! ఆదోరం ఆదోరం సినీమాకి ఎల్లాల్సిందే. ఆ ఆదోరం అనాగే ఎల్లేం.

మావు ఎవులమూ సూడ్నేదు! నానూ సూడ్నేదు! మా ఇంటి పక్క ఆదెమ్మా సూడ్నేదు! మాతో పాటు ఆదెమ్మ సినిమాకి వచ్చింది. ఎవుడో ఆడు. మావు ఎరగం- ఆడుసూసేట్ట! సూసినోడు ఆరా తీసుకుంటూ మా అయ్య బడ్డీ దుకానానికే ఎల్లినాట్ట! మా అయ్య బడ్డీ సినీమా




-చాగంటి తులసి

హాలుకి దగ్గర్నోనే కదా ఉందీ! పలానా బొట్టి ఎవులి బొట్టీ? అనడిగేట్ట. "మా బొట్టే ఏం?" అన్నాటయ్య. "నీ బొట్టే?!" అని ఆడు యమ ఆచ్చెరపోయాట్ట! మా అయ్య నల్లటోడు మరి! "మా బొట్టి అంటే మా మరదలి కూతుర్నే" అని అయ్య సెప్పేతలికి "అదీ అనాసెప్పు మరి అనా సెప్పు" అన్నాట్ట. 'ఆ బొట్టిని నాకిచ్చీమను' అనీ ఆడు అన్నాట్ట.

"ఏటీ ఇదేటన్నా కూరగాయల మారుకెట్టనుకున్నోవా? సూసి నచ్చుకుని సంచీలో ఏసుకు ఎల్లిపోడానికి! నీకంత నచ్చితే మీ పెద్దోళ్ల నొట్టుకురా. మాటా మంచీ అవుతాది. ఇటు మావోళ్లూ అటు మీవోళ్లూ ఒప్పుకుంటే మనువవుతాది. అంతేకాని నా బడ్డీలోకి జొరబడి నీ మరదలి కూతుర్నిచ్చీ అంటే ఇన్నవోడు ఎవుడూ నోటితో నవ్వడు! అదే నాకుదురుద్దీ?" అన్నాటయ్య.

"ఎందుకుదర్దూ? ఎనాకుదురదో నానూ సూస్తాను. ఏటనుకుంటున్నానో! దారి కాసి ఎత్తుకు పారిపోతాను." అని నవ్వుతూ ఎల్లిపోయాట్ట.

దాంతో మా వంతా బెగిలిపోయాం. తొరాత తెలిసింది ఆడు మాజాతోడేనని! నాగుమణిని మాతో పాటు గెడప దాటి బయటికి ఎల్లనిచ్చేవోరు కాదు.

వోరం గడిసింది. పద్దినాలైనాది. ఎవులూరానేదు. ఆడెవుడో గాని ఉత్తిపున్నేనికి అడలుగొట్టీసీడు. మరిహ పర్నేదనుకునే తలికి ఆడు తిన్నగా ఇంటికే పారొచ్చినోడు. ఒక్కడూ కాదు. ఆడితో పాటు ఆడి అప్పా బావా కూడా వొచ్చినారు. ఈది ఈదంతా ఆళ్లని సూడొచ్చేరు. "నాగుమణిదెంత దురుస్టం అంటే ఎంత దురస్టం" అన్నారు. అన్ను మరీ! ఆడు సూపులకా సినీ మా స్టారు నా ఉన్నాడు. లారీల్ల డెయివోరు! గెడ్డాల్గీసుకుని పావల్డబ్బులు తెచ్చుకునేవోడు కాదు!!

ఆయాళ శీకిష్టా హాలుకాడ మమ్మల్ని సూసి ఆరా తీసి మా అయ్య బడ్డీ కాడి కెల్లి అయ్యతో మాటాడి తిన్నగా నారీలో నోడు తీసుకుని రాయపూరు ఎల్లిపోనాట్ట. నారీమీద ఆడు అనా పదేసి రోజులు, పదేన్రోజులు దూరంగా ఎత్తా ఉండాలిట! ఆ ఎల్లినోడు మన్నీ తిరిగిప్పుడే వొచ్చినోడంట. వొచ్చీరాడం అప్పా బావనీ ఎంటేసుకుని మా ఇంటికి పారొచ్చినోడు.

అనా జరిగింది దాని మనువు! అంత మోజుపడి దీన్నాడు సేసుకున్నోడు. అంత మోజుతోనూ సూసుకున్నోడు. ఆసీరలేంటి ఆ రైకలేంటి ఎన్నెన్ని తెచ్చీవోడో! ఏ దిక్కుకి ఎల్తే ఆ దిక్కు దినుసులొట్టుకొచ్చీవోడు! ఆ పేర్నే నానోటికి రావు. ఏటేటో ఎన్నెన్ని రకాలో మిఠాయిలు తెచ్చీవోడు. అంత మురిపంగా ఏ మొగాడూ ఏ ఆడదాయినీ సూడ్డం నాను సూడ్నేదు. అనాంటి మొగుడు నోకం ఎక్కడో నూటికో కోటికో ఏ ఆడదాయికో దొరుకుతాడు కాని అందరికీ దొరకడు. దాన్నెంటేసుకుని ఆడు ఈదిలో ఎల్తూంటే ఈది ఈదంతా ముచ్చటపడి పోయేది!

అమాయకపు గుంట! అన్నిదాల సూసుకునేవోడు దొరికేడు. పిల్లా పాపా కలిగి పది కాలాల పాటు పచ్చగా బతుకుతాది దానికేటి అనే అనుకున్నాం.

అందరి దిస్టే తగిలినాది. దాంది మూన్నాళ్ల బతుకైపోనాది. ఎప్పట్నాగేనే నారీ మీద నోడేసుకుని ఎల్లినోడు మన్రానేదు! ఒహటే కబురు! బ్రిడిజీ కాడ పెమాదమైపోనాది! నారీ తిరగబడిపోనాది! ఈడు పిప్పి పిప్పి అయిపోనాడు! మా అందరి కడుపులు తరుక్కుపోనాయి. నాగుమణి మన్నీ మామూలు మనిసవుతాదని మావు ఎవులమూ అనుకోనేదు. ఎర్రి సూపులు సూస్రూ రేతిరీ పొగలూ అనాకూకునే ఉండేది. గట్టిగా ఏడిసేదీ కాదు.

మారు మనువుకెంత సెప్పినా ఇనుకోందే! మారు మనువు వొప్పుకున్నా ఇనా అయ్యేది కాదేమో! ఎవుడో ఒహడు ఆడంత మురిపెంగా సూసుకోకపోయినా మొగుడంటూ ఓడుంటే బాగుండిపోయేది! పిల్లా పాపా కలిగి కుసింత ఆరిందానా గడుస్తేరింతొ రాతన్నా దాన్తర్లాత ఇనా అయినా బాగుంటేది- మారుమనువుకి అది మొగ్గని మాట నిజిమ్- అనుడే ఆడలా అద్దానపు సావు సచ్చీతరికి ఎవుడూ మన్నీ దీన్ని ఎంత సక్కటి సుక్కయినా సేసుకునేందుకు మొగ్గు సూపనేదు. దీని జాతకం సెడ్డదీ- దీన్ని కట్టుకుంటే ఏటి ముడతాదో అని పెతీవోడూ అండమే- పల్లెటూళ్లోర్లిద్దరు ముగ్గురొచ్చినోరు అనుతే పల్లెటూళ్లకిచ్చి నాబం నేదు. మావొందరమూ టోనుల్లో పుట్టి పెరిగిన గుంటలం. పల్లెటూరి పాటు మాకెక్కడ సేతవుద్దీ? పాటు పడందే పెనిమిటింటైనా గెంజినీళ్లొయ్యరు!!

ఆయమ్మ మొగుడు ఉత్తరాదిని అదేదో ఊళ్లో పెద్ద ఉద్యోగం సేస్తన్నాడట! సంటిపిల్లతో ఆయమ్మ ఇంటి పని సేసుకోనేకపోతోందిట! ఎవత్తేనా ఆయమ్మతో రాడానికి దొరకుతాదా అని భోగట్టా సేసింది.

మరొహత్తికీ మరొహత్తికీ సెప్పడం దేనికీ నాగుమణిని తోల్తేనో? ఉన్నూరు నుంచి దూరంగా ఎల్తే దాని మనసు కుదట బడతాదేమో! ఆయమ్మతో ఆయమ్మ సంటిపిల్లతో కొన్నాళ్ల పాటు ఉంటే మామూలు మనిసి అవుతాది. నాలుగు ఊళ్లు తిరిగితే కుసంత రాటు తేలి గడుస్తనం నేరుస్తాది అదిగో ఆ ఆలోసనొచ్చింది. దూరం అయినా ఆయమ్మతో పంపీసినాం. నాగుమణిని సూసి ఆయమ్మ మా సంబరపడిపోనాది!

ఆడుపోడమే గోరం అనుకుంటే మరింత గోరం జరిగిపోనాది!

కబురందింది. నెత్తీ నోరూ కొట్టుకుంటూ పిన్నాయన అంత దూరం పడిపోనాడు. ఎల్లేదన్నమాటే గాని ఏటినాబం! బొట్టి పోనే పోనాది. సూపుకేనా అందుకోనేకపోయాడు.

నాగుమణి గట్టు మీంచి కాల్జారి నూతిలో పడిపోనాదిట!

"నా బంగారు బొట్టో! నాగుమణో!" అని గుండె బాదుకుని ఏడ్సే సిన్నాయనని రైలెక్కించడానికి కూడా వచ్చిన ఆయమ్మ గారి బంట్రోతు సెప్పబట్టి గాని నేకపోతే అసలేటి జరిగినాదో మా ఎరుక్కి వొచ్చీదే కాదు.

"దేశం కాని దేశంలో మన మాటా పలుకూ లేని సోట ఏటడిగితే మాత్రం ఏట్నాబం? మన బొట్టి బతికొస్తాదా? ఆళ్ల పెద్దోళ్లు!" పిన్నాయన ఏడుస్తూ సెప్పినాడు.

పిన్నాయన కాదు! నాను ఎల్లాల్సింది! ఆ పెద్ద మనిసిని ఈదినోకి ఈడిసేదాన్ని!

నాగుమణికి సక్కదనమే ఉన్నది. ఉత్తి అమాయకపు గుంట పాప. ఏటీ తెలీదు. నా సిన్ని బొట్టి ఆరేళ్ల గుంట. దానికున్న పాటి గడుస్తనం, సలాకీతనం అన్నా దీనికి లేవు. కూకో అంటే కూకోడం నిల్సో అంటే నిల్చోడం. అంతే తెలుసు. నోరన్నది అస్సలుకి నేదు. అంత అమాయకపు దాయి!

అద్సరే- దీనికి నోరు నేదు. ఆయమ్మ పెద్దింటావిడ! సదూకున్నది. తన ఎరికిని తన పెనిమిటే ఎదవ పనికి పూనుకుంటే ఏటీ సెయ్యనేక ఎర్రి దానిలా ఏడిసిందట!

మొగోడు ఎదవ పనులు సేస్తే కట్టుకున్న ఆడది ఆణ్ణి సెప్పెట్టుక్కొట్టద్దా? ఆడది తప్పు సేస్తే కట్టుకున్న మొగుడు నోర్మూసుకుని పల్లకుంటున్నాడా? నడీదినోకి కొప్పెట్టి నాగి మరీ యాగీసేసి నానా గోలా సెయ్యటంనేదా? చావకొట్టటం నేదా?

ఆయమ్మ మొగుడు పెద్ద ఉద్యోగమే సేస్తన్నాడు. దానిపైన ఇంకా పెద్ద ఉద్యోగం ఉందట. అదా బాబుకి కావాలంట- తనపైవోడ్ని సంతోసపెడితే సిటికినో దొరికిపోద్దిట!

తేరగా కనిపించింది నాగుమణి! సక్కటిది! సిన్నది! తనపై వోడి పక్కనో తొంగో పెట్టినాడు! ఆయమ్మ ఏటీ సెయ్యనేక ఏడిసిందంట! ఎందుకూ సదుగులు! ఎందుకు పెద్దిరికాలు!!

నా పెనిమిటి నా ఎరికిని కాని నా సాటుని కాని ఆడిసు కాని కైనా ఆడి నాబానికైనా ఇనాటి ఎదవ పని సేస్తే ఆయమ్మనా ఎర్రిదాన్లా నానేడిసే దాన్నా? నానుంటూ ఉండగా నా ఎదురుగ్గా నా పెనిమిటి ఎదవ ఏసాలు ఎయ్యిడానికి దయిర్యం సెయ్యగలిగేవోడా? ఒహవేళ సేసేడే అనుకో నాను పల్లక సూస్తూ ఊరుకుంటానా? ఆణ్ణి ఈదినోకి నాగి నలుగురి ఎదటా సెప్పెట్టి కొట్టి ఎదవ పనికి బుద్ధి సెప్పేదాన్నా? కాదా?

నాగుమణికి బదులు నాను గాని ఆయమ్మ ఇంట పని సెయ్యడానికి ఎల్లి ఉంటే ఆళ్లు సేసిన పనికి నాగుమణిలా నూతిలో పడి సచ్చేదాన్నా?

నాన్నోరున్న దాన్ని!

ఆయమ్మనీ ఆయమ్మ మొగుణ్ణీ అనాగా ఇనాగా ఒగ్గిదాన్నా? ఆడెవుడో ఆపైవోడు! ఆణ్ణి ఒగ్గిదాన్నా?

నన్నిడిగితే పెతీ ఆడ కూతురికీ నోరుండాల! పెద్దింటిదవనీ, పిన్నింటిదవనీ, సదూకున్నదవనీ, సదూ సంజా లేనిదవనీ ఆడదాయికి నోరుండాల! సదూ సక్కదనం కాదు. ముందల నోరుండాల! నోరులేన్దాయిని నోకం బతకనివ్వదు.

*

## నండూరి గారు చెప్పిన జోక్

ఒక ప్రఖ్యాత సంపాదకుడికి ఒకసారి అంపెడిసైటిస్ వ్యాధికి శస్త్ర చికిత్స చేయవలసి వచ్చింది. ఆయనంటే గిట్టని కొందరు క్రూరమైన జోక్ ప్రచారం చేశారు. "ఫలానా ఎడిటరుకి ఆమధ్య ఆపరేషన్ చేసినప్పుడు పొట్టలో అక్షరం ముక్క కూడా కనబళ్లేదట" అని.